పేదలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

- జిల్లా అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- కవ్వగుంటలో గడపగడపకు మన ప్రభుత్వం

పెదవేగి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరవుతున్నాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. 108 రోజు గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఆదివారం పెదవేగి మండలం కవ్వగుంటలో ఎమ్మెల్యే పర్యటించారు. ముందుగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక సర్పంచ్ మద్దాల వాణి పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలు చేస్తున్న సంక్షేమం పథకాలను, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పథకాలు మంజూరు కావాలంటే మండల కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని, అయితే ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా జగనన్న మెరుగైన పాలన అందిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో జగనన్నకు ప్రజలందరూ అండగా ఉండి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ తాతా రమ్యకుమార్, సర్పంచ్ మద్దాల వాణి, విజయరాయి సొసైటీ అధ్యక్షుడు పాలడుగు సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, మద్దాల నాగయ్య, నిమ్మల సుబ్బారావు, ఆరేపల్లి రత్నాకరరావు, పసుపులేటి రాజేష్, నిమ్మల సత్తిబాబు, పామర్తి వీరయ్య, మండల సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్, గొడుగు కిరణ్, వార్డు సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, మండల, గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

రామాలయ నిర్మాణానికి కృషి

దెందులూరు: సోమవరప్పాడులో ప్రాచీన రామాలయం స్థానంలో నూతన ఆలయం నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఆదివారం దెందులూరు కార్యాలయంలో మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, సోమవరప్పాడు సర్పంచ్ సరిగే నాగరాజు, సొసైటీ చైర్మన్ వేమూరి బసవపున్నయ్య, గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిశారు. సోమవరప్పాడులో ప్రాచీన రామాలయం స్థానంలో భక్తులు, గ్రామస్తుల అవసరాలకు అనుగుణంగా నూతన ఆలయం నిర్మించాలని కోరారు.

క్లుప్తంగా

వేంకటేశ్వరునికి క్షీరాభిషేకం


గుండుగొలనులో స్వామి వారికి క్షీరాభిషేకం

భీమడోలు: గుండుగొలనులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రవణ నక్షత్రంను పురస్కరించుకుని స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో మాజీ ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు సహకారంతో ఆలయ పూజారి మంగపతి ఆచార్యులుస్వామి వారికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పువ్వులతో సుందరంగా అలకరించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో డి.శంకరరావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సామాజిక తనిఖీ

పెదవేగి : జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా రెండేళ్లలో నిర్వహించిన పనులకు సంబంధించి అధికారులు సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో డీఆర్‌పీలు తనిఖీలు ప్రారంభించారని పెదవేగి ఏపీఓ హేమలత అన్నారు. ఆదివారం పెదవేగి మండలంలోని 30 పంచాయతీలకు 15 మంది డీఆర్‌పీలు, రెండు గ్రామాలకు ఒకరు చొప్పున తనిఖీలు చేస్తారని, వీరిని ఎస్‌ఆర్‌పీ వేముల కనకరావు పర్యవేక్షిస్తారని ఏపీఓ చెప్పారు. 2020–21 ఆర్థిక సంవత్సరాల్లోని పనులకు సంబంధించి తనిఖీలు నిర్వహించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎస్ఆర్‌పీ కనకరావు తెలియజేశారు.

కానిస్టేబుల్ పరీక్షకు 105 మంది గైర్హాజరు

దెందులూరు: వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం పోలీస్ కానిస్టేబుల్ ఎంపికకు రాత పరీక్ష నిర్వహించారు. 18 గదులలో 850 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 105 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని కళాశాల ఏఓ కరుణానిధి తెలిపారు. 90 శాతం అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్ పర్యవేక్షణలో పెదవేగి సీఐ ఎన్.దుర్గాప్రసాద్, దెందులూరు ఎస్సై వీర్రాజు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది.

క్రీడా పోటీల్లో విద్యార్థినుల విజయభేరి

దెందులూరు: ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం అంతర కళాశాలల క్రాస్‌కంట్రీ క్రీడా పోటీల్లో గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాల మహిళలు విజయభేరి మోగించారు. ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా, ప్రోగ్రాం ఇన్‌చార్జి డాక్టర్ పీడీకేడీ ప్రసాద్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ల సంయుక్త శిక్షణలో భాగంగా అఖిలభారత క్రాస్‌కంట్రీ పోటీలకు గోపన్నపాలెం కళాశాల మహిళలు ఆరుగురు ఎంపిక కావడం గర్వకారణంగా ఉందన్నారు. వీ.పూజ, బైరెడ్డి లీలావతి, జీ.నందిని, ఎ.లక్ష్మి, ఎస్. నాగదుర్గ, జీ. గంగాభవాని అఖిలభారత క్రాస్‌కంట్రీ పోటీలకు ఎంపికై గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రతిష్టను ఇనుమడింప చేశారని ప్రిన్సిపల్ డాక్టర్ సలీం బాషా, ఇన్‌చార్జి ప్రసాద్ అన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

గణపవరం: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని, అనారోగ్యం, వృద్ధాప్యంతో బాధపడుతున్న వారిని నైట్ డ్యూటీల నుంచి మినహాయించాలని వీఆర్ఏ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం.ఆంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం గణపవరం గణపవరం సీపీఎం కార్యాయలయంలో నిర్వహించిన మండల వీఆర్‌ఏల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మండల సీఐటీయూ నాయకులు పెంటారావు, వీఆర్ఏ సంఘం సభ్యులు ఎరిచర్ల వెంకట్రావు, చిలగా శ్రీను, పట్టాభి, సాయి, రాము పాల్గొన్నారు.

నేడు చిత్రలేఖనం పోటీ

దెందులూరు: గోపన్నపాలెం కేంద్రీయ విద్యాలయలో సోమవారం భారతీయ విద్యాశాఖ ఆధ్వర్యంలో కేంద్రీయ ఎగ్జామ్స్ వారియర్, విద్యార్థులకు చిత్రలేఖనం పోటీ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ ఎస్.నాగేంద్రకుమార్ తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా అన్ని కేంద్రీయ విద్యాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

వినోదభరితంగా హాసం క్లబ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నగరానికి చెందిన హాసం క్లబ్ ప్రతి నెలలో నిర్వహించే హాస్య కదంబ కార్యక్రమం ఆదివారం అత్యంత వినోదభరితంగా సాగింది. హాసం క్లబ్ కన్వీనర్ జీఎస్‌ఆర్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు సభ్యులు హాస్య వల్లరి ప్రదర్శించారు. సభ్యులు జోకులు, పేరడీ పాటలు, పాత సినీ గీతాలు ఆలపించి కార్యక్రమాన్ని రక్తి కట్టించారు. నగరానికి చెందిన వ్యాపారవేత్త దొంతంశెట్టి విశ్వేశ్వర రావును క్లబ్ తరపున ఘనంగా సన్మానించారు. హాసం క్లబ్ సభ్యులు ఎస్.బాబి, గురుశర్మ, శ్రీహరి కోటి, టి.శుభ, పి. దుర్గ, డాక్టర్ దొంతంశెట్టి బసవరాజు, ఎస్.చంద్ర, ఎ.మహీధర్, ఎస్ఆర్ ప్రతాప్, మల్లినేని బాబ్జి పాల్గొన్నారు.

ఉన్నత పదవులు అధిరోహించాలి


కొండలరావుపాలెంలో కొఠారుకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలుపుతున్న నేతలు

పెదవేగి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన మండల కన్వీనర్‌గా నియమితులైన కేశన సతీష్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, మాజీ ఏపీ ఆయిల్‌ఫెడ్ రైతు కమిటీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. పెదవేగి మండలం కొండలరావుపాలెం పార్టీ కార్యాలయంలో పెదవేగి మండల నూతన కన్వీనర్‌గా కేశన సతీష్‌ను నియమించడంపై పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. కొఠారును కలిసిన పార్టీ శ్రేణులు, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొఠారు మాట్లాడుతూ పార్టీని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేయాలని సూచించి, సతీష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వంగూరు ఉపసర్పంచ్ జలగం రామ్మోహనరావు, ఎంపీటీసీ గొంగటి మరియమ్మ ప్రేమ్‌చంద్, ఇతర గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుంతలో ముసలమ్మవారిని దర్శించుకున్న వాసుబాబు

నిడమర్రు: నిడమర్రు మండలం బావాయిపాలెం లోని పుంతలో ముసలమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా ఆదివారం ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వాసుబాబుకు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి జాతర మహోత్సవాలు ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆలయం వద్ద గ్రామస్తుల సహకారంతో సుమారు పదివేల మందికి మాంసాహారంతో అన్నసమారాధన నిర్వహించారు. అన్నసమారాధనను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆలయ ట్రస్టీ ముత్యాల పెదబాబు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సంకు సత్యకుమార్, జిల్లా రైతు సలహా సంఘం చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నాగిశెట్టి సుబ్బయ్య, పార్టీ నాయకులు గాదిరాజు విశ్వనాథరాజు, ముత్యాల బాలాజీ, సంకు పద్మాకర్, బొబ్బిలి వెంకటేశ్వరరావు, ముత్యాల సుబ్బయ్య, దారాబత్తుల సరయ్య, ముత్యాల రాము, మండల టీడీపీ కన్వీనర్ ముత్యాల స్వామి, మాజీ సర్పంచ్ వేముల బాలశంకర్ పాల్గొన్నారు.


బావాయిపాలెం పుంతలో ముసలమ్మ అమ్మవారి సన్నిధిలో వాసుబాబు తదితరులు

భక్తులపై భవానమ్మ దీవెనలు మెండు

భీమడోలు: పూళ్ల, ఎంఎంపురం గ్రామాల ఇలవేల్పు భవానమ్మ దీవెనలు భక్తులపై మెండుగా ఉందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. పూళ్ల శివారులోని భవానమ్మ ఆలయంలో ఆదివారం నిర్వహించిన చండీ హోమ పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గణపతి తదితరులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుబాబు చండీ హోమ పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి గణపతిని, కుటుంబ సభ్యులకు వాసుబాబు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి రాజీలు, సభ్యులను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, భీమడోలు ఎఎంసీ వైస్ చైర్మన్ పులిచర్ల వెంకట కృష్ణారావు, పెద్దలు యాసా వెంకట్రామయ్య, దాసం మంగయ్య, ఎండా రవి తదితరులు పాల్గొన్నారు.

కొలుసు రెడ్డి యాదవ్ మృతి తీరని లోటు

పామర్రు వైసీపీ ఎమ్మెల్యే కొలుసు పార్థసారధిని ఆదివారం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పరామర్శించారు. పామర్రు ఎమ్మెల్యే కొలుసు పార్థసారధి తండ్రి, మాజీ ఎంపీ కొలుసు రెడ్డి యాదవ్ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వాసుబాబు పామర్రు వెళ్లి అక్కడ ఎమ్మెల్యే పార్థసారధిని పరామర్శించారు. రెడ్డి యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ రెడ్డి యాదవ్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. ప్రస్తుత రాజకీయ నాయకులకు ఆయన ఆదర్శంగా నిలిచారన్నారు. పామర్రు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

భీమడోలు: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని పలువురు వక్తలు అన్నారు. గుండుగొలనుకి చెందిన ముస్లిం నాయకుడు షేక్ మహ్మద్ జహీర్ జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన నేపథ్యంలో ఆయనను ఆదివారం గ్రామ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి, అభినందించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పార్టీ కోసం కష్టించి పని చేసిన వారికి తగిన సమయంలో గుర్తింపు ఇస్తూ పార్టీ శ్రేణులకు అండగా ఉంటున్నారన్నారు. వైసీపీకి సేవలందిస్తున్న జహీర్‌కు జిల్లాస్థాయిలో పదవి రావడానికి ఎమ్మెల్యే వాసుబాబు విశేష కృషి చేసారన్నారు. జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జహీర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ కోసం పని చేసిన వారికి తగిన గుర్తింపు ఇస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు గొటికల మురళి, నాయకులు నల్ల శ్రీనివాసరావు, మర్రాపు బాబు, నాగనబోయిన కృష్ణ, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


గుండుగొలనులో జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యుడిగా నియమితులైన జహీర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

గ్రంథాలయాల్లో ఉత్సాహంగా 'చదవడం మాకిష్టం'

భీమడోలు: భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం ఉల్లాసభరిత వాతావరణంలో నిర్వహించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 35 మంది బాలబాలిలు సామూహిక పుస్తక పఠనంలో పాల్గొని పుస్తకాలను చదివారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలకు సత్యం ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయసారథి ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో లయన్స్ డైమండ్స్ అధ్యక్షుడు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తుమ్మల ఉమామహేశ్వరరావు పాల్గొని పుస్తకాలను చదవడం వల్లే కలిగే ప్రయోజనాలను చిన్నారులకు వివరించారు. పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌వీ అమర్‌నాథ్, జి.నాగమణి, రీడర్స్ ఫోరం సభ్యుడు ఎస్.కృష్ణ, సుబ్రహ్మణ్యం, కడగల సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.


భీమడోలులో సామూహిక పఠనంలో పాల్గొన్న చిన్నారులు, తుమ్మల ఉమామహేశ్వరరావు

53 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

దెందులూరు: స్థలాలు పొందిన లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, దెందులూరు ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి కోరారు. గోపన్నపాలెంలో సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ అధ్యక్షతన 53 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో యుద్ధప్రాతిపదికన రోడ్లు, తాగునీరు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటుతో పాటు నిర్మాణ సామగ్రిని త్వరితగతిన అందించేందుకు గోడౌన్లు స్థానికంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ దివ్య, ఏపీఎం వేణుగోపాల్, కార్యదర్శి యహోషువా, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండేటి గంగాధరబాబు, మాగంటి కృష్ణమోహన్, మోర్ల సుబ్బారావు, వీరంకి సత్యనారాయణ, వార్డు మెంబర్లు, ఉపసర్పంచ్ ఏనుగు హేమసాగర్ పాల్గొన్నారు.


గోపన్నపాలెంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ లక్ష్మి, కామిరెడ్డి నాని

గ్రామీణ పేదలకు ఉచిత వైద్య సేవలు

గణపవరం: గ్రామీణప్రాంత నిరుపేదలకు కార్పొరేటు వైద్య సేవలు ఉచితంగా అందించడానికి ఉచిత వైద్యశిబిరాల ఏర్పాటు, ప్రజలకు ఆరోగ్య అవగాహన సదస్సులు ఎక్కువగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర కమ్యూనిటీ పారామెడిక్స్ అం డ్ ప్రైమరీ హెల్త్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి విబిటి రాజు అన్నారు. రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా గణపవరం యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం లయన్స్ క్లబ్ భవనంలో వారికి సన్మాన కార్యక్రమం, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు మండల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ప్రభాకరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్యసేవలు అందిస్తున్న ప్రైమరీ హెల్త్ ప్రొవైడర్స్‌ను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నూతనంగా ఎన్నికై న ప్రభాకరరావు, రాజును ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందచేశారు ఈకార్యక్రమంలో రాష్ట్ర పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నిడమర్తి జయసూర్య, మండల పీహెచ్‌సీ కార్యదర్శి యు.శివ శ్రీనివాసరావు, కోశాధికారి కె.అప్పారావు, ఉపాధ్యక్షుడు సీహెచ్ ప్రభాకరరావు, సభ్యులు పాల్గొన్నారు.


ప్రభాకరరావు, వీబీటీ రాజును సన్మానిస్తున్న దృశ్యం

ప్రశాంతంగా కానిస్టేబుల్ రాత పరీక్ష


సీఆర్ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్షా కేంద్రం వద్ద బారులు తీరిన అభ్యర్థులు


సీఆర్‌రెడ్డి ఇంటర్ క్యాంపస్ వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కానిస్టేబుల్ పోస్టులకు చేపట్టిన ఎంపిక పరీక్ష ఆదివారం ప్రశాంతంగా సాగింది. ఏలూరు జిల్లా పరిధిలో భారీ ఎత్తున అభ్యర్థులు కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపిక పరీక్షకు హాజరయ్యారు. ఏలూరు సీఆర్‌ఆర్ విద్యాసంస్థల వద్ద పరీక్షకు హాజరైన అభ్యర్థుల దృశ్యాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు

జూనియర్ కళాశాలల్లో బోధనా సిబ్బందిని నియమించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జిల్లా పరిషత్ జూనియర్ కళాశాలల్లో శాశ్వత ప్రాతిపదికన బోధనా సిబ్బందిని నియమించాలని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను కోరారు. ఆ సంఘ ఏలూరు జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఎంఈఓ –2 పోస్టులపై న్యాయపరమైన చిక్కులు తొలగినందున అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు, ఆసక్తి కలిగిన ప్రధానోపాధ్యాయులకు అవకాశం కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. సమావేశంలో సంఘ రాష్ట్ర సలహాదారు మరడాని అచ్యుత రావు, రాష్ట్ర నాయకులు ఆర్ నాగేంద్రసింగ్, ఎన్.ఆజాద్, ఎం.రాంబాబు, ఆర్. వెంకట్, టి.రాము, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

24న చలో భీమవరం

దెందులూరు: ఈనెల 24న ఉభయగోదావరి జిల్లాలోని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఈఎఫ్ విభాగాల నాయకులు, కార్యకర్తలకు భీమవరం తరలిరావాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు తనగాల శేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం అక్కిరెడ్డిగూడెంలో మాట్లాడుతూ మాదిగల చిరకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణ బిల్లుపై బీజేపీ వైఖరిని తెలియజేయాలని, వచ్చే పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు తీర్మానం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేస్తామన్నారు. చలో భీమవరం కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ అధ్యక్షుడు కే మురళి కోరారు.

ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక చట్టాన్ని కొనసాగించాలి

భీమడోలు: ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని శాశ్వతంగా కొనసాగించి దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకుని వచ్చి ఆదుకోవాలని మండల కేవీపీఎస్ కన్వీనర్ టి.సుమన్‌బాబు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళికా చట్టాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలని కోరారు.

4, 5వ తేదీల్లో ఏలూరులో బాలోత్సవం

భీమడోలు: వచ్చే నెల 4, 5వ తేదీల్లో ఏలూరులో నిర్వహించనున్న హేలాపురి బాలోత్సవం సంబరాలకు మండలం నుంచి 3 నుంచి 10వ తరగతి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మండల యూటీఎఫ్ అధ్యక్షుడు జీజే రవికాంత్, మండల ప్రధాన కార్యదర్శి జి.బాలభాస్కర్ ఆదివారం కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు బాలోత్సవంలో పాల్గొని విజేతలుగా నిలవాలని కోరారు.

25న ఎల్ఐసీ ఏఓఐ సర్వసభ్య సమావేశం

ఏలూరు (టూటౌన్) : ఈ నెల 25న స్థానిక పవరుపేటలోని ఉద్దరాజు భవనం వద్ద నిర్వహించే ఎల్ఐసీ ఏఓఐ సర్వసభ్య సమావేశానికి ఏజెంట్లు అందరూ హాజరు కావాలని సర్వసభ్య సమావేశ ఆహ్వాన సంఘం విజ్ఞప్తి చేసింది. స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద ఆహ్వాన సంఘం సమావేశం అధ్యక్షుడు గద్దె విజయభాస్కర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ హాజరు కానున్నట్లు తెలిపారు. ఏఓఐ సెంట్రల్, జోనల్, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

నేడు గోగుంటలో 'గడపగడపకు'

పెదపాడు: మండలంలోని గోగుంటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి తెలిపారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారని తెలిపారు. ఈకార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

నేడు అప్పనపేటలో గడపగడపకు

గణపవరం: గణపవరం మండలం అప్పనపేటలో ఈనెల 23వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం 121వ రోజు నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు ఎమ్మెల్యే వాసుబాబు వివరించి, వారి సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈకార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

రిటైర్డ్ ఉద్యోగిని ఢీకొట్టిన మోటార్ సైక్లిస్టు

భీమడోలు: కొత్త హైవేపై మార్నింగ్ వాకింగ్ చేస్తున్న రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగిని ఓ మోటార్ సైక్లిస్టు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి వర్గాల నుంచి వచ్చిన సమాచారం మేరకు శనివారం భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసారు. భీమడోలుకు చెందిన రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి సలాది సత్యనారాయణ ఈనెల 19న తెల్లవారు జామున మార్నింగ్ వాక్ చేస్తుండగా వెనుక నుంచి ఓ మోటార్ సైక్లిస్టు వేగంగా వచ్చి ఢీకొట్టాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు.

హైవేలపై మార్నింగ్ వాక్ వద్దు

హైవేలపై స్థానికులు మార్నింగ్ వాక్ చేయవద్దని ఎస్సై చావా సురేష్‌కుమార్ అన్నారు. వాహనదారులు సౌలభ్యం కోసం గరిష్ఠ వేగాన్ని అనుమతించిన హైవేలపై మార్నింగ్ వాక్ చేయడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు. వాకింగ్ చేసే వారంతా వేరే మార్గాల్లో వెళ్లాలని ఆయన కోరారు.

26న ఏలూరులో నిరసన ర్యాలీ

పెదపాడు: రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా తాత్సారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఈనెల 26న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఏలూరులో రైతు ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల ర్యాలీ నిర్వహించనున్నట్టు ఆదివారం ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ తెలిపారు. పెదపాడులోని నర్రా ఆంజనేయులు భవనంలో ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా రైతులతో కలిసి నిర్వహించనున్న ట్రాక్టర్లు ర్యాలీ పోస్టర్లు, కరపత్రాలను ఏపీ రైతు సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కే శ్రీనివాస్ మాట్లాడుతూ ఢిల్లీ రైతాంగ ఉద్యమం ఫలితంగా మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మోసగించిందని విమర్శించారు. ఈనెల 26న రిపబ్లిక్‌డే సందర్భంగా ఏలూరులో అల్లూరి సీతారామరాజు స్టేడియం నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో రైతులు, కార్మికులు నిర్వహిస్తున్న రైతు ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు లింగం కృష్ణారావు, మండల కార్యదర్శి గుండపనేని సురేష్ వివిధ సంఘాల నాయకులు షేక్ కరీముల్లా, పిట్టా రహాయేల్, రెడ్డి లక్ష్మణరావు, ముసునూరి కొండలరావు పాల్గొన్నారు.

రజక సంఘం జిల్లా కార్యదర్శిగా పుల్లయ్య


పుల్లయ్యకు నియమాక పత్రం అందజేస్తున్న రజక సంఘం జిల్లా అధ్యక్షుడు కట్లయ్య

గణపవరం: రజకుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని, జిల్లా రజక జన సంఘం కార్యదర్శిగా నియమితులైన వైఎస్సార్ సీపీ బీసీ విభాగం సీనియర్ నాయకుడు బుద్ధారపు పుల్లయ్య అన్నారు. జిల్లా రజకజన సంఘం కార్యదర్శిగా తనను నియమించిన జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా సంఘం కార్యదర్శిగా నియామకపత్రాన్ని ఆదివారం బుద్దారపు పుల్లయ్యకు కట్లయ్య అందజేశారు.